కథ

# చెయ్యి తిరిగిన రచయిత

కోలపల్లి ఈశ్వర్

ఎందుకని ఇలా జరుగుతోంది?

ఎంత ఆలోచించినా కారణం ఏంటో అంతుబట్టలేదు 'కూరా'కి. 'కూరా' అంటే అదతని సొంత పేరు కాదు కలంపేరు. అసలు పేరు కూర్మారావ్. దాన్నే అలా కుదించి 'కూరా' గా మార్చుకున్నాడు.

ఎందుకని?

ఎందుకని ఇలా జరుగుతోంది??





అంతకుముందు కూడా అనేక సార్లు అతనలా వర్రీ అయ్యాడు గానీ, ఈ రోజు మాత్రం అతన్లోని ఆ వర్రీ చాలా చాలా ఎక్కువైపోయింది... తీవ్ర స్థాయిలో వెళ్లింది. కూర్చుంటే అదే ఆలోచన. నిల్చుంటే అదే ఆలోచన. పడుకుంటే అదే ఆలోచన. చివరికి చెప్పకూడదు గానీ– లావెట్రీలో కూడా అదే ఆలోచన.

అందుకే ఇతను స్థిమితంగా ఉండలేకపోయాడు.

దేర్ మస్ట్ బి సమ్‌థింగ్ రాంగ్!

లేకపోతే ఎందుకిలా జరుగుతుంది?

ఇంతకుముందు సంగతెలా ఉన్నా'ప్రేమ విజయా'న్ని మాత్రం చాలా అద్భుతంగా రాశాడు తను.

నిజంగా అది ఎంత మంచికథ!

అలాంటిది కూడా తిరిగొచ్చేసిందీ అంటే– తను రాసే విధానంలో ఏదో లోపముందన్న మాట.

అదేంటో ఎలా తెలుస్తుంది?

షేవింగ్ చేసుకుంటూ అతనలా ఆలోచిస్తుండగా, అతని మనసులో సడన్‌గా షణ్ముఖ రావ్ మెదిలాడు.

షణ్ముఖరావ్ చెయ్యి తిరిగిన రచయిత. అతని రచనలు దాదాపు తెలుగులో వున్న అన్ని పత్రికల్లోనూ చాలా విరివిగా పడుతుంటాయ్.

అతనుండేది కూడా విజయనగర్ కాలనీలోనే కదా!

వెళ్ళి– ఓ మారు సలహా అడిగితేనో–

మనకి తెలియని విషయాల్ని తెలిసిన వాళ్ల దగ్గర్నుంచి అడిగి తెలుసుకోవడంలో తప్పేముంది? ఇందులో బిడియపడాల్సింది ఏముంది?

ఈ ఉపాయం ఏదో బాగానే ఉన్నట్టనిపించడంతో షేవింగ్ చేసుకోవడం పూర్తవ్వగానే 'ప్రేమ విజయం'తోపాటు 'పాప ఫలితం' 'జబ్బున పడ్డ జంబులింగం', 'పరివర్తన' అనే కథల్ని కూడా చేతబట్టుకుని షణ్ముఖ రావు దగ్గరికి బయల్దేరాడు కూరా.

షణ్ముఖ రావ్ పాపం చాలా మంచివాడల్లే ఉన్నాడు. పేరున్న రచయితైనప్పటికీ కూడా తన రాకని ఏ మాత్రం విసుక్కోలేదు. కూరా చెప్పిందంతా సావధానంగా ఆలకించాడు. ''అయితే మీరు మంచి రచనలు చేస్తున్నప్పటికీ తిరిగొచ్చేస్తున్నాయంటున్నారు...'' అన్నాడు వినడం అయ్యాక.

''నాకైతే అలాగే అనిపిస్తోంది సార్! నే వ్రాసిన కథల్లో నాకు చాలా బాగా నచ్చిన వాటిని తెచ్చాను. అమూల్యమైన మీ సమయాన్ని వేస్ట్ చేస్తున్నాననుకోకపోతే– దయచేసి వీటిని చదివి, లోపాలేంటో తెలియజేస్తే, నేను చాలా సంతోషిస్తాను'' అంటూ వెంట తెచ్చుకున్న రెగ్జిన్ బ్యాగ్ లోంచి కథల్ని బయటకు తీశాడు కూరా.

''చాలా థ్యాంక్స్ సార్..మీకు శ్రమ కలిగిస్తున్నందుకు నన్ను మన్నించాలి'' అంటూ కూరా వినయంగా నమస్కరించి, అతని వద్ద నుంచి సెలవు తీసుకుని వచ్చేశాడు.

నిగర్వి– పేరున్న రచయితయ్యిండి కూడా ఎంత ఇదిగా మాట్లాడాడు! అనుకున్నాడు మనసులో కూరా!

★★★

ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా? అని ఆ రోజంతా ఎంతో ఆత్రంగా ఎదురుచూసి– మర్నాడు మళ్లీ అదే సమయానికి షణ్ముఖరావ్ వద్దకు ఠంచనుగా చేరుకున్నాడు కూరా. పలకరింపులు అవీ అయ్యాక అసలు విషయంలోకి వచ్చాడు షణ్ముఖరావ్.

''మీ కథలు చదివానండీ...శైలి పరంగానూ, శిల్పం పరంగానూ మీ రచనల్లో దోషాలేంలేవు. కానీ ఇతివృత్తాలు ఎన్నుకోవడంలోనే మీరు పప్పులో కాలేశారు'' అన్నాడు.

''అంటే?'' అడిగాడు కూరా.

''మీరెన్నుకున్న ఇతివృత్తాల్లో వాస్తవికత లోపించింది. మీ 'ప్రేమ విజయం' కథని తీసుకుంటే అందులో కోటీశ్వరురాలైన ఓ అమ్మాయి ఓ

పోస్టమేన్‌ని ప్రేమించి పెళ్లి చేసుకుంది. నిజ జీవితంలో ఇలా జరుగుతుందా ఎక్కడైనా? రియల్ లైఫ్‌లో అంత డబ్బున్న అమ్మాయికి పోస్ట్ మేన్ అనబడే వాడు ఓ పురుగులా కనిపిస్తాడు. అలాంటప్పుడు అతన్ని ప్రేమించడం, అనేది ఎలా జరుగుతుంది? అదే విధంగా మీ 'పరివర్తన' కథని తీసుకుంటే అందులోని మీ 'యాంటి హీరో' కల్పన అనే అమ్మాయిని కామించి, రేప్ చెయ్యబోతాడు. కానీ చివరి ఘడియలో ఆమె అతన్ని ''అన్నయ్య'' అని, ఈ చెల్లె జీవితం నాశనం చేస్తావా అన్నయ్యా?'' అని కన్నీళ్ళతో ప్రార్థించగానే హృదయం కరిగి, తన శాలువాని ఆమె మీద కప్పి వెళ్లిపోతాడు. అసలతను ఒక అమ్మాయిని రేప్ చేయబోయాడు అంటేనే హృదయం లేనట్టు లెక్క! అలాంటిది అది కరగటం అనేది ఎలా జరుగుతుంది? సో.. ఇది కూడా అసహజంగా ఉంది. ఇకపోతే మరోకథ పాపఫలితాన్ని తీసుకుంటే...

''వద్దు సార్... ఇంకేం చెప్పొద్దు'' అంటూ షణ్ముఖరావ్ మధ్యలోనే అడ్డుపడ్డాడు కూరా.

''నా ఇతివృత్తాల్లో సహజత్వం లోపించింది. అంతే కదా! అదే కదా మీరు చెప్పేది.

''అవును అందుకే మనం ఎన్నుకునే ఇతివృత్తాలు ఊహాజనితాలు కాకుడదెప్పుడూ'' అన్నాడు షణ్ముఖరావ్.

''అదెలా సార్? ఊహించకుండా కథలెలా రాయగలం?'' గడ్డం కింద గీరుకుంటూ అడిగాడు కూరా.

''నిజ జీవితంలో మనకెదురయ్యే సంఘటనల్ని ఆధారంగా తీసుకోవాలి. లేదా మనకి పరిచయమున్న వ్యక్తుల జీవితాల్ని ఆధారంగా తీసుకోవాలి. అంటే యథాతథంగా రాయాలని కాదు. మన కల్పనలో కాసిన్ని మెరుగులు కూడా దిద్దవచ్చు. అలా వాస్తవాన్ని ఆధారంగా చేసుకొని రాసిన కథల్లో వాస్తవికత, జీవం, ఆటోమేటిక్‌గా ఉంటుంది. కాబట్టి, అవి తప్పకుండా ప్రచురణార్హాలవుతాయి! అందరి సంగతి ఏమో గానీ, నేననుసరించే టెక్నిక్ మాత్రం ఇదే! నచ్చితే మీరు కూడా నా సలహాని పాటించండి'' అంటూ ధర్మ సూక్ష్మం బోధపరిచాడు షణ్ముఖరావ్.

''ఎంతో అనుభవంతో మీరు చెప్పిన మాట కాదని నేనెలా అంటాను సార్? తప్పకుండా ఇకనుంచి మీ సలహా పాటిస్తాను. ఇంత అమూల్యమైన సలహా ఇచ్చినందుకు మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేను'' అంటూ కాస్త అతిగానే కృతజ్ఞతలు తెలియజేసుకుని అక్కడ్నుంచి వచ్చేశాడు కూరా.

★★★

ధర్మసూక్ష్మం అర్థమైపోయాక ఇంక వర్రీ అవ్వాల్సిందేముంది?

ఇంటికి రాగానే వెంటనే కలం పట్టి షణ్ముఖరావ్ చెప్పిన సలహా మేరకు ఓ చక్కటి కథ రాసిపారేశాడు కూరా.

ఆ కథ చక్కగానే కాకుండా చాలా శృంగార భరితంగా కూడా కుదిరింది. ''అదిరిందిది'' అని తన మట్టుకు తనకే అనిపించటంతో ఆ కథని, ఓ ప్రముఖ వార పత్రిక వాళ్లు నిర్వహిస్తోన్న శృంగార కథల పోటీకి పంపించేశాడు కూరా.

ఆశ్చర్యం!

ఆ కథకి ఆ పోటీలో మొదటి బహుమతి వచ్చింది. అంబరాన్ని తాకుతున్న ఆనందంతో కూరా వెంటనే షణ్ముఖరావ్ దగ్గరికెళ్ళి అతనికి నిండు మనసుతో థ్యాంక్స్ చెప్పుకున్నాడు.

''మీరిచ్చిన అమూల్యమైన సలహాని ఆచరణలో పెట్టడం వల్లే ఇది సంభవమయ్యింది సార్! లేకపోతే నాకేంటి, ఫస్ట్ ప్రైజ్ రావడమేంటి? ఈ ఘనత నిస్సందేహంగా మీకే చెందుతుంది...''

కూరా అలా అంటుంటే-''భలే వారండీ'' ఇందులో నా ఘనతేముందీ? ఏదో నాకు తోచిన సలహా నేను చెప్పానంతే..'' అంటూ తెలివిగా నాలుక చప్పరించేవాడు షణ్ముఖరావ్. ఎంతైనా నిగర్వి కదా!

★★★

ఆ పత్రికలో ఆ కథ అచ్చయిన మర్నాడే- కూరా ఓ చెయ్యి తిరిగిన రచయితైపోయాడు. అంత స్వల్ప వ్యవధిలోనే అదెలా సంభవమైందంటే- ఇలా-

ఆ కథ చదివిన కూరా కొలీగ్ రాంప్రసాద్ వల్ల!!

''దొంగ రాస్కెల్! ఏదో క్లోజ్ ఫ్రెండ్‌వి కదాని మా ఎదురింటి 'ఆంటీ'తో నాకున్న 'ఎఫైర్' గురించి నీతో చెబితే, కనీసం పేర్లయినా మార్చకుండా అదంతా కథగా రాస్తావా? నలుగుర్లో నా పరువేం గావాలని? ఇంటిపేరు, వీధిపేరు, డోర్ నెంబర్... ఏకరువు పెట్టావే? అసలు ఏంటీ నీ ఉద్దేశ్యం. నిన్ను... నిన్నూ'' అంటూ కూరా కుడి చేతిని పట్టుకుని- ఆ చేత్తోనే అతనా కథ రాశాడు. అందుకని దాన్ని శక్తి కొద్దీ మెలి తిప్పేశాడు రాం ప్రసాద్- అలవిమాలిన కసితో!

అతనొక మహాబలశాలి కావటం వల్ల ఆ దెబ్బకి కూరా కుడి చెయ్యి ఎక్కడికక్కడ జాయింట్లు ఊడిపోయి వంకరగా తిరిగిపోయింది.

మూడు చోట్ల 'డిజ్ లొకేషన్' అయ్యింది.

పుత్తూరు వెళితే పెదవి విరిచారు. కేరళా వెళితే మావల్ల కాదన్నారు. చెన్నై వాళ్లు 'ఎన్నా' అంటూ పంపించేశారు. అప్పుడు కూరా ఫ్రెండు పోరా(పోతురాజుని...వాళ్ల ఫ్రెండ్ సర్కిల్లో అలానే పిలుస్తారు) తీసుకెళ్లి ''గోవిందా..గోవిందా..నర్సింగ్ హోంలోని ఆర్థోపెడిక్ వార్డులో, నూట పదకొండో నెంబర్ గదిలో చేర్పించాడు.

మూడు నెలలకు పైగా ఉండిపోవలసి వచ్చింది అక్కడ. అందుకే- చెయ్యి తి(వి)రిగిన ఆ రచయిత తన మలికథని వెంటనే రాయలేకపోయారు.

★


"ఆకాశంలో గ్రహాలు ఎన్ని ఉన్నా వెలుగు నిచ్చేది సూర్యుడొక్కడే
లోకంలో మ్యారేజ్ బ్యూరోలు ఎన్ని ఉన్నా పెళ్లి కుదిర్చేది కాకతీయ ఒక్కటే"

కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-2374 7777, 09396 999 999


శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచి

FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | (చెన్నై) టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | (చెన్నై) పోరూర్ | 093855 99077 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | (చెన్నై) తాంబరం | 093400 99993 |
| విజయవాడ | 093922 92939 | బెంగుళూరు | 093429 39345 |
| గుంటూరు | 098485 35375 | జయానగర్ | 093429 39343 |
| తెనాలి | 098480 31931 | మైసూరు | 093429 39342 |
| విశాఖపట్నం | 098481 63833 | కోయంబత్తూరు | 093457 94668 |
| రాజమండ్రి | 098485 35377 | సేలం | 093855 99066 |
| కాకినాడ | 098483 37378 | మధురై | 093603 35233 |
| ఖమ్మం | 093470 59988 | వెల్లూర్ | 093449 94400 |
| ఒంగోలు | 098487 11223 | తిరుచి | 098428 01111 |
| నెల్లూరు | 098481 97222 | పాండిచ్చేరి | 098421 27777 |
| తిరుపతి | 098485 35378 | ఈరోడ్ | 093855 99011 |
| కర్నూల్ | 093900 33815 | అనంతపూర్ | 093460 09348 |

www.kaakateeya.com